
సాక్షి
బాపట్ల

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు
తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.



సుబ్బారాయుడి సేవలో..
మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మదాయశాఖ అడిషనల్ కమిషనర్ కోడూరి రామచంద్ర మోహన్ సోమవారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఎస్ఈబీ ఆఫీసర్‌గా మహేష్‌కుమార్



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్‌గా సిహెచ్‌వి మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. తొలుత ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఐ వాసుకు ఇండియన్ పోలీస్ మెడల్



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): దేశ సరిహద్దులో మండే ఎండ.. ఎముకలు కొరికే చలి.. వర్షాన్ని లెక్క చేయకుండా సేవలందించిన జవాన్ ఆయన.. ఆర్మీ నుంచి వచ్చిన తరువాత ప్రజా సేవ చేయాలనే తలంపుతో పోలీసుశాఖలో ఎస్ఐగా చేరారు. ఎన్నో కేసులు ఛేదించారు.. మరెన్నో అవార్డులు తీసుకున్నారు. ఆయనే మేడికొండూరు సీఐ కె.వాసు. ఆయన విశేష పనితీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)కు ఎంపిక చేసింది.

ఇదీ ప్రస్థానం..
1998లో ఆర్మీలో చేరిన వాసు కాశ్మీర్, పంజాబ్, గుజరాత్‌తోపాటు పలు ప్రాంతాల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో పనిచేశారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పోరాడారు. బీఎస్ఎఫ్ నుంచి బయటకు వచ్చిన ఆయన 2004లో ఆర్మ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) ఎస్ఐగా ఎంపికయ్యారు. ఏడేళ్ల పాటు యాంటీ నక్సల్ స్క్వాడ్ (ఏఎస్ఎస్)లో పని చేసి 2011లో కఠిన సేవా పతకం పొందారు. 2014లో సివిల్ పోలీసు విభాగానికి కన్వర్ట్ అయిన వాసుకు 2021లో సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. గుంటూరు జిల్లాలో సెల్‌ఫోన్ కంటైనర్ చోరీ చేసిన మధ్యప్రదేశ్ ఖంబిర్‌భట్‌కు చెందిన దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో వాసు ప్రతిభ కనబరిచి డీజీపీ నుంచి మెడల్‌ను పొందారు. బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకోవటంతోపాటు, అతనికి ఉరిశిక్ష పడేందుకు పాటుపడ్డారు. దీనికి కేంద్రహోంశాఖ మంత్రి నుంచి అవార్డు పొందారు. అంత్రిక్ సురక్ష సేవా పతకం, ఉత్రిక్ష సేవా పతకం, ఏబీసీడీ అవార్డు వంటివి అందుకున్నారు. తాజాగా ఉత్తమ సేవల విభాగంలో ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఐ కె.వాసు మాట్లాడుతూ ఐపీఎం అవార్డుకు ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నేడు పాఠశాలల్లో జాతీయ పతాక ఆవిష్కరణలు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఎగురవేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ కమిటీ చైర్మన్లు జెండాను ఆవిష్కరించాలని విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో శైలజ తెలిపారు. పేరెంట్ కమిటీ చైర్మన్లు అందుబాటులో లేని పక్షంలో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.

ఐక్యతను చాటే త్రివర్ణపతాకం

గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: త్రివర్ణ పతాకం ఐక్యతను చాటుతుందని, అందులోని మూడు రంగులు శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతకు చిహ్నమని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అధికారులకు, ప్రజలకు జాతీయ జెండాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడుకలకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపైనా, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. దేశ పౌరుల బంధాన్ని బలోపేతం చేసే శక్తి త్రివర్ణ పతాకానికి ఉందని కలెక్టర్ చెప్పారు. అనంతరం జాతీయ జెండాను అధికారులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తి..

స్వాతంత్య్రం ఓ పోరాట గీతిక.. ఉద్యమ దీప్తి.. స్ఫూర్తి బావుటా.. బానిస సంకెళ్లు తెంచుకుని భారతావని స్వేచ్ఛా విహంగ గీతికై 77వ వసంతంలోకి అడుగు పెట్టింది.. ఎందరో వీరుల త్యాగం నెత్తుటి తిలకం దిద్దుకుని యువతలో స్ఫూర్తిని రగిలించింది.. ఇక్కడే జాతీయ నాయకులు రాజకీయ ఓనమాలు దిద్దారు. పంద్రాగస్టు సందర్భంగా అణువణువునా నిండిన దేశభక్తి మువ్వన్నెల జెండాపై రెపరెపలాడుతోంది.





1933లో నిర్వహించిన ఆల్ ఇండియా రాజకీయ పాఠశాల(ఫైల్)

- మంతెనవారిపాలెం ఉద్యమ కేంద్రం
- జాతీయ నాయకుల ఓనమాలు దిద్దిన చరిత్ర
- బ్రిటీష్ పాలకులను ముప్పతిప్పలు పెట్టిన ప్రజలు



గాంధీ బస చేసిన వెంకటరాజు ఇల్లు(ఫైల్)

బాపట్లఅర్బన్/పిట్టలవానిపాలెం/చెరుకుపల్లి: స్వాతంత్య్రం.. మహోద్యమ ఘట్టం. అందులో పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలేనికి ప్రత్యేక స్థానం ఉంది. పన్నుల నిరాకరణ ఉద్యమంలో బ్రిటీష్ పాలకులను ముప్పతిప్పలు పెట్టిన ఊరు. 1922లోనే మహాత్మాగాంధీ పర్యటించిన సందర్భంలో ఆయనకు ఆతిథ్యమిచ్చిన గ్రామం. మహాత్మాగాంధీ హరిజన నిధి సేకరించగా మహిళలు డబ్బుతో పాటు బంగారం ఆభరణాలు విరాళంగా అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. 1933లో జాతీయ స్థాయిలో రాజకీయ పాఠశాల స్థాపించి జాతీయ నేతలకు రాజకీయ పాఠాలు నేర్పింది. ఉద్యమాల పురిటి గడ్డగా స్వాతంత్రోద్యమ చరిత్రలో చెరగని స్థానం సంపాదించింది. గ్రామంలో జన్మించిన మంతెన వెంకటరాజు స్వాతంత్య్ర స్ఫూర్తికి నడుంబిగించి ఎంతో మంది యువకులను ఉద్యమం వైపు నడిపించారు.

మంతెన.. పంతం..
మంతెన వెంకటరాజు 17వ ఏటనే చదువుకు స్వస్తి చెప్పి, 1921లో సమరంలో చురుగ్గా పాల్గొన్నారు.1930లో ఉప్పుసత్యాగ్రహం చేసి ఉప్పు పండించి జైలు కెళ్లారు. 1932లో విదేశీ వస్త్రాలు బహిష్కరించి, కల్లు పాకల వద్ద పికెటింగ్ చేసి జైలుకు వెళ్లారు. 1933లో ఆంగ్లేయుల బారి నుంచి గాంధీ విగ్రహాలను కాపాడడానికి స్వామి సీతారామ్ అధ్యక్షతన మంతెనవారిపాలెంలో 40 అడుగుల ఎత్తు దిమ్మె నిర్మించి గాంధీ విగ్రహాన్ని మొట్టమొదట స్థాపించారు. ఆల్ ఇండియా రాజకీయ పాఠశాల నిర్వహించారు. అప్పటి సోషలిస్ట్, కమ్యూనిస్టు భావాలు కలిగిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడ శిక్షణ పొందారు. గుంటూరు జిల్లాలో ప్రముఖ నాయకులైన కాసు బ్రహ్మానందరెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, వెనిగళ్ల సత్యనారాయణ లాంటి వారిని రాజకీయ ప్రవేశం చేయించిన ఘనత వెంకటరాజుదే. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలో చాలామంది ఉన్నారు.

బంగారం ఆభరణాలు ఇచ్చి..
1929లో మహాత్మగాంధీ హరిజన నిధికి బంగారు నగలు, ధనాన్ని ప్రజలు విరాళంగా అందజేశారు. ఆ రోజు కనుమూరి వెంకటరాజు మేడ మీద నిద్రించారు. ఆ ఇల్లు ఇప్పటకి స్మారకంగా ఉంది. ప్రతి ఏడాది ఆగస్టు 15న, స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా ఉంది.

వినయాశ్రమంలో గాంధీజీ కుటీరం



స్వాతంత్య్ర ఉద్యమానికి కావూరు వినయాశ్రమం కేంద్రంగా ఉండేది. మహాత్మా గాంధీజీ దేశ పర్యటనలో భాగంగా 1929, 1933 ఇక్కడకు వచ్చారు. ఆ సమయంలోనే వినయాశ్రమంలో మొక్క(రావి) నాటారు. 1933 డిసెంబర్ 23న గాంధీ కుటీరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి చెందిన స్వామి సీతారం, తుమ్మల బసవయ్య, తుమ్మల దుర్గాంబ దంపతులు గాంధీజీ శిష్యులుగా సేవలందించారు. వీరు జైలు జీవితం గడిపారు. స్వాతంత్య్రానికి పూర్వమే కావూరు వినయాశ్రమంలో అక్షర విలాస్ పేరుతో ప్రెస్ నిర్వహించారు. ఈ ప్రెస్ ద్వారా యంగ్ ఇండియా, ఆంధ్రా హరిజన్, సర్వోదయం అనే పత్రికలు నడిచేవి. 1959లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ వినయాశ్రమం సందర్శించారు. గాంధీ ప్రధాన అనుచరుడు వినోబాంజి ఏర్పాటు చేసిన స్థూపం వద్ద సంస్కృతంలో ఉన్న వేదాలను వేద పండితులతో తెలుగులోకి అనువాదం చేసి ఆయనకు బహుమతిగా అందించారు. తరువాత డాక్టర్ ఎన్‌జీ రంగా కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలు అందించారు. కేవీకే చైర్మన్ పదవి కోసం అదే గ్రామానికి చెందిన రెండు వర్గాలు పోటీలు పడి కేసులు నమోదు కావటంతో వినయాశ్రమం, కేవీకే రెండు మూతపడ్డాయి.

భావపురిలో మహనీయుల అడుగుజాడలు



టౌన్‌హాలు

స్వాతంత్య్ర ఉద్యమాలను భావపురి నిండు మనసుతో స్మరించుకుంటోంది. అడుగిడిన మహోన్నత ఘట్టాలను తలుచుకుని ఉప్పొంగుతోంది. 1931లో గాంధీజీ బాపట్లలో నడిచిన రోడ్డుకు మహాత్మాగాంధీ రోడ్డుగా నామకరణం చేశారు. ఇప్పుడు బాపట్ల తాలూకా ఆఫీస్ నుంచి భావన్నారాయణ స్వామి గుడికి వెళ్లే రోడ్డును మహాత్మా గాంధీ రోడ్డు అని పిలుస్తున్నారు.

సహాయ నిరాకరణోద్యమంలో..
1920లో సహాయ నిరాకరణోద్యమాన్ని బాపట్ల తాలూకాలోని 64 గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసుకుని ఉద్యమం నడిపారు. ఉద్యమంలో భాగంగా 1921 డిసెంబర్ 31న గ్రామోద్యోగులు 48 మంది రాజీనామా సమర్పించారు. బాపట్ల ప్రాంతానికి చెందిన ఆంధ్రరత్న దుగ్గిరాలతో పాటు మంతెన కృష్ణంరాజు, బూదరాజు లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసింహారావు, పిల్లుట్ల హనుమంతరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు పంతులు వంటి వారు జైలుకెళ్లారు.

వస్తు బహిష్కరణతో జైలుకి..
పన్నుల నిరాకరణోద్యమంలో భాగంగా నాటి బాపట్ల తాలూకాలోని పెదనందిపాడు ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి జిల్లా కలెక్టర్ రూథర్ ఫర్డ్ మిలిటరీ క్యాంపు ఏర్పాటు చేశారు. సంకా సీతారామయ్య, దాసరి శ్రీరాములును పెదనందిపాడు నుంచి చిలకలూరిపేట వరకు 8 మైళ్లు గుర్రం వెంట శిక్షగా పరుగెత్తించారు. 1930లో సాగిన ఉద్యమంలో పాల్గొన్నందుకు బాపట్ల తాలూకాలోని 124 మందిని నాటి ప్రభుత్వం జైలుకు పంపింది. విదేశీ వస్తు బహిష్కరణ పాటించిన 44 మందిని 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు శిక్ష విధించారు.

బాపట్ల టౌన్ హాల్..
టౌన్ హాల్ కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రథమాంధ్ర మహాసభలకు, పోరాటాలకు టౌన్ హాల్ వేదికగా నిలిచింది. బాపు, నెహ్రూ, బాబూ రాజేంద్ర ప్రసాద్ వంటి వారు బాపట్ల వచ్చినప్పుడు టౌన్ హాల్‌ను సందర్శించారు. ప్రస్తుతం ఈ హాలులో నృత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిని న్యూస్ పేపర్ క్లబ్‌గా కూడా తీర్చిదిద్దారు.

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలపై అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పండుగను ఉత్సవంగా నిర్వహించాలని కోరారు. అభివృద్ధిని చాటిచెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలని చెప్పారు. పోలీస్ కవాతు మైదానంలో నిర్వహించే వేడుకలకు ఉదయం ఎనిమిది గంటలకే జిల్లా అధికారులు, ఉద్యోగులంతా హాజరు కావాలని కోరారు. కలెక్టరేట్‌పై ఉదయం 7.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

స్టాల్స్ తిలకించేలా..
వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసే స్టాల్స్ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించేలా ఉండాలని కలెక్టర్ కోరారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ శకటాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నప్పటికి అధికారులు ప్రాధాన్యాన్ని గుర్తించలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం, అధికారులు అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వేడుకలు జరిగే ప్రాంగణం సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. నా భూమి- నా దేశం కార్యక్రమాలు ఈనెల 28వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని కోరారు.

స్పందనలో అర్జీలు పరిష్కరించాలి..
కలెక్టరు అధ్యక్షతన నిర్వహించిన స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించారు. 106 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటికి కలెక్టరు తక్షణమే పరిష్కర మార్గం చూపగా మిగిలిన వాటిని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వెబ్ సైట్‌లో అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలని కలెక్టరు రంజితబాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 384 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. వై.ఎస్.ఆర్ ప్రమాద బీమా పథకంలో పెండింగ్ దరఖాస్తులు పరిష్కారానికి జిల్లా కలెక్టరు అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటయ్యిందని, జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్.శ్రీధర్ తెలిపారు. డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.



స్వాతంత్య్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు అయింది. మంగళవారం సంక్షేమ పథకాలకు చెందిన శకటాలను ప్రదర్శించనున్నారు. అన్ని శాఖలకు చెందిన స్టాళ్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. - బాపట్ల టౌన్

బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళిక

బాపట్ల: జిల్లాలో తీర ప్రాంతాల్లో ఉన్న 33 బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రణాళికలు పంపడానికి కమిటీ తీర్మానం చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్ లోని స్పందన సమావేశం హాల్‌లో జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 6 మండలాల్లో 33 చోట్ల టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం గుర్తించినట్లు చెప్పారు. జిల్లాలో టూరిజం శాఖ గుర్తించిన 33 బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ఇవ్వడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బీచ్‌ల వద్ద పర్యాటకులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, బెంచ్‌లు, ఫుడ్ కోర్ట్ లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రాథమికంగా ఐదు బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్ సర్టిఫికెట్ కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని టూరిజం అధికారులను ఆదేశించారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస రావు, జిల్లా టూరిజం అధికారి సురేష్, డీఎంహెచ్‌ఓ విజయమ్మ, జిల్లా అటవీశాఖ అధికారి భీమా నాయక్, పాల్గొన్నారు.

పంద్రాగస్టు కవాతు..



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌ను ఉత్సవాలకు సిద్ధం చేశారు. మంగళవారం నిర్వహించనున్న వేడుకలకు వేదికతో పాటు వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సబంధించిన శకటాలు పర్యటించేందుకు వీలుగా గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించి, పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడుకలను వీక్షించడానికి వచ్చే ప్రజలకు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల డీఎస్పీ టి. వెంకటేశులు, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మథరావు పాల్గొన్నారు.

జిల్లా మంత్రులు రాక..
పంద్రాగస్టు వేడుకలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. వీరితో పాటు కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

క్లుప్తంగా

రామన్నపేటలో రెండు వార్డులు ఏకగ్రీవం

వేటపాలెం: మండలంలోని రామన్నపేట పంచాయతీలో రెండు వార్డులకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు తేదీ కావడంతో నామినేషన్ వేసిన నాలుగురు అభ్యర్థుల్లో ఇద్దరు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 6 వార్డులో నామినేషన్ వేసిన ఇద్దరిలో కొమరగిరి శ్రీనివాసరావు తన నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు. అదే విధంగా 10 వార్డులో నామినేషన్ వేసిన ఇద్దరిలో గొరాబత్తిన యల్లమందేశ్వరావు విత్ డ్రా చేసుకున్నాడు. దీంతో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులు 6 వార్డు పాట్లూరి మహాలక్ష్మయ్య, 10వ వార్డులో గొరా బత్తిని నాగరాజకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఆర్‌ఓ ఐ.కాశీ విశ్వనాథ్ ప్రకటించారు. మొదట్లో 6 వార్డులకు ఆరుగురు, 10 వార్డుకు పది మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా వారిలో 12 మంది నామినేషన్లు అసంపూర్తిగా ఉండటంతో వారి నామినేషన్‌లు ఆర్‌ఓ తిరస్కరణకు గురయ్యాయి. 6 వార్డులో ఇద్దరు, 10 వార్డులో ఇద్దరి నామినేషన్లు మిగిలాయి. వీటిల్లో 6 వార్డులో ఒకరు, 10 వార్డులో ఒకరు వారి నామినేషన్‌లు ఉపసంహరించుకున్నారు. దీంతో రెండు వార్డులలో వైఎస్సార్ సీపీ బలపరచిన ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా విజయం సాధించారు.

ఇద్దరు వీఆర్వోలకు ఉత్తమ సేవా అవార్డులు

చీరాల టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో ఇద్దరు వీఆర్‌ఓలు ఉత్తమ సేవా అవార్డులకు ఎంపికైనట్లు చీరాల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సోమవారం తెలిపారు. ఉత్తమ సేవా అవార్డులకు ఎంపికైన వాడరేవు వీఆర్‌ఓ(ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) సీహెచ్ శేఖర్, తోటవారిపాలెం వీఆర్‌ఓ డి.సాల్మన్‌లను అభినందించారు. మంగళవారం విజయవాడలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డులు అందుకోనున్నట్లు చెప్పారు. రెవెన్యూశాఖలో ఉత్తమ సేవ అవార్డులు సాధించిన శేఖర్, సాల్మన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో డీటీ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై తక్షణమే స్పందించాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాధితులతో మాట్లాడుతునన ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 56 మంది ఫిర్యాదుదారులు అర్జీలు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలు అధికంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

కోడి పందేలు... పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కోడిపందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 10 ప్రదేశాల్లో దాడులు నిర్వహించి 63 మందిని అదుపులోకి తీసుకుని రూ.1,46,620 సీజ్ చేశారన్నారు. వీటితో పాటుగా మూడు ద్విచక్ర వాహనాలు, 8 సెల్ ఫోన్లు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ, డయల్ 100, ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నంబర్ 8333813228లకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

అమరవీరులను స్మరించుకుందాం

నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: అమరవీరులను స్మరించుకోవడమే ఆజాదీకా అమృత్ మహోత్సవం ధ్యేయమని జిల్లా ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా నా భూమి... నా దేశంలో నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో అధికారులు, సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేసి, అమరవీరులకు వందనం చేశారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. డీఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అమరవీరుల త్యాగాలకు గుర్తుగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి 'నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు పాల్గొన్నారు.

'ఎయిమ్'లెస్‌తో రోగులకు నరకం



ఓపీ వద్ద వేచిఉన్న రోగులు



మందుల దుకాణం వద్ద కిటకిట

- సమాచారం ఇచ్చే వారు కరువు
- రోగుల సహనాన్ని పరీక్షిస్తున్న ఎయిమ్స్ సిబ్బంది
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- సహనం నశించి ఆందోళనకు దిగిన వృద్ధురాలు

మంగళగిరి: పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్) సిబ్బంది, వైద్యుల తీరుతో రోగులకు నరకం కనిపిస్తోంది. సమయానికి హాజరుకాని సిబ్బంది, వైద్యులు వ్యవహరిస్తున్న తీరుతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ఏ సేవలు అందిస్తారో రోగులకు కనీస సమాచారం ఇచ్చే నాథుడు లేకపోవడంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యం వలన్ల కష్టాలు తప్పడం లేదు. రోగి ఆస్పత్రికి వెళ్లిన అనంతరం ఫోన్‌లో అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పించే వారు లేరు. ఆధార్ కార్డు లేకపోతే వెనక్కి వెళ్లాల్సిందే. ఫోన్ లేని రోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఓపీ క్యూలో నుంచుని నంబర్ తీసుకోవడానికే నాలుగు ఐదు గంటల సమయం పడుతుండడంతో రోగుల్లో ఓపిక నశిస్తోంది. గత్యంతరం లేక వెనక్కి వెళ్లిపోయి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ అప్పులు పాలవుతున్నారు. సిబ్బందిలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బంధువులు లేదా డబ్బులు ఇచ్చిన వారిని ముందు పంపుతుండడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందితోనూ వాగ్వివాదానికి దిగుతుండటం సర్వసాధారణంగా మారింది. రోగుల బాధల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం శోచనీయం.

సోమవారం ఉదయం యర్రబాలేనికి చెందిన పాశం లక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఉదయం 6 గంటలకే ఆసుపత్రికి చేరుకుంది. ముందుగా సిబ్బంది టోకెన్ ఇవ్వకుండా అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఫోన్ లేదని చెప్పడంతో పక్కన కూర్చోమన్నారు. మధ్యాహ్నం 11 గంటలయినా సిబ్బంది ఆమె పట్టించుకోలేదు. రిసెప్షన్‌లో అడిగితే సిబ్బంది కసురుకోవడంతో వృద్ధురాలిలో ఓపిక నశించింది. తన బంధువులకు ఫోన్ చేసి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు వారితో బైఠాయించింది.



ఆందోళనకు దిగిన పాశం లక్ష్మమ్మతో మాట్లాడుతున్న ఎయిమ్స్ అధికారులు

మధ్యాహ్నం 12 గంటలకు మెడికల్ సూపరింటెండెంట్ వచ్చి ఆమెను బతిమాలి లోపలికి తీసుకెళ్లి పరీక్షలు చేశారు.



ప్రసాద్, విజయవాడ

విజయవాడకు చెందిన ప్రసాద్ కాలి ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారు. వీల్‌చైర్ లేక రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది.

మెరుగైన సేవలందించేందుకు కృషి

రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. దీని కోసం ఫోన్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం.

– డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, ఎయిమ్స్ డైరెక్టర్

టీటీడీకి పర్చూరు నుంచి శనగలు



జెండా ఊపి శనగల లారీని పంపుతున్న అధికారులు

పర్చూరు(చినగంజాం): ప్రకృతి విధానంలో పండించిన శనగలను అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 14 శాతం తేమకు మించని 190 టన్నుల శనగలను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. వాటిని మూడు లారీలలో తిరుమలకు పంపించేందుకు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తిరుమలలో జరిగే నిత్యాన్నదానం కోసం నాణ్యమైన శనగలను పంపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- జైల్లో పరిచయాలు.. చోరీలకు పన్నాగం
- రూ.16.50 లక్షల సొత్తు, విదేశాల కరెన్సీ స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చిత్రంలో ఏఎస్పీలు శ్రీనివాసరావు, సుప్రజ

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గడిచిన రెండు నెలల్లో జరిగిన తొమ్మిది కేసుల్లో రూ.16.50 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, మరో కేసులో విదేశాల కరెన్సీ సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాల్ని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ వెల్లడించారు. గత రెండు నెలలో మంగళగి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజా, చినకాకాని, ఎర్రబాలెం గ్రామాల్లో, ఎన్నారై జంక్షన్ వద్ద తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. వరుస చోరీల్ని కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్, గుంటూరు సీసీఎస్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి జల్లెడ పట్టారు. అందులో ఓ పాత నేరస్తుడి వేలిముద్రలు సరిపోవడంతో ఆ దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం గౌరవరం గ్రామ వాసి తోట శివకుమార్ అలియాస్ శివ భవాని, విజయవాడ పాయకాపురం సింగ్‌నగర్‌లో ఉంటున్న మంగళగిరి రత్నాలచెరువు 13వ వీధికి చెందిన వెంగళ భవానీశంకర్, విశాఖపట్నం మురళీనగర్ లాస్ట్ బస్టాఫ్‌కు చెందిన లాలం లోకేశ్వరరావు, మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్న వనం శివనాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. తొమ్మిది చోరీ కేసుల్లో రూ.16.50 లక్షల విలువ చేసే 294 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి, రూ.75 వేలు, సామర్లకోట పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో విదేశాల కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసుల్ని త్వరితగతిన ఛేదించిన ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఉత్తర డీఎస్పీ రాంబాబు, మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ వి.భూషణం, ఎస్ఐలు బి.జగన్‌మోహన్‌రావు, జె.క్రాంతికిరణ్, వి.బాబూరావు (సీసీఎస్), పలువురి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాల్ని అందించారు. ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పాల్గొన్నారు.

వయసు 32.. కేసులు 70కి పైగా..

అంతర్రాష్ట్ర ముఠాలో కీలక వ్యక్తి శివ భవాని. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లను గుర్తించేవాడు. ఒకవేళ జనసంచారంతో రద్దీ ఉన్నట్లైతే రాత్రిపూట దొంగతనాలకు పాల్పడేవాడు. అతని వద్దనున్న ఇనుపరాడ్‌తో ఇళ్ల తాళాలను తేలికగ్గా పగులకొట్టేవాడు. అయితే శివ భవాని, లోకేశ్వరరావుపై సస్పెక్ట్ షీట్‌లున్నాయి. వీరిద్దరికీ రాజమండ్రి కేంద్ర కారాగారంలో పరిచయం ఏర్పడింది. శివ భవానీపై దాదాపు 70కి పైగా కేసులున్నాయి. ఇళ్ల దొంగతనాలు చేయడంలో ఆరి తేరినవాడు. ఇందులో రిసీవర్ అయిన శివనాగేశ్వరరావు, వెంగళ భవానీ శంకర్ బాల్య స్నేహితులు. వీరందరూ ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారు.

పల్నాడులో పకడ్బందీగా రేషన్ బియ్యం పంపిణీ

నరసరావుపేట: జిల్లాలో 6,36,802మంది లబ్ధిదారులకు మంజూరైన 8997.06 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంను 402ఎండీయూ మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికి పకడ్బందీగా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. గడప చేరని రేషన్ అంటూ ఓ దినపత్రిక(సాక్షిలో కాదు)లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని ఆమె ఖండించారు. కచ్చితమైన తూకం, లబ్ధిదారుల వేలిముద్రలను సేకరించి బియ్యం పంపిణీ చేయటం జరుగుతుందని చెప్పారు. డోర్ డెలివరీని నిత్యం అధికారులుగా మేము పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఎండీయూ వాహనం ఇళ్ల వద్దకు రాకపోతే టోల్‌ఫ్రీ నంబరు 1967 ఫోన్‌చేసి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వాహన ఆపరేటర్ రాకపోతే వీఆర్వోతో పంపిణీ చేయిస్తున్నామన్నారు. వలంటీర్ల ద్వారా మొబైల్ వాహనం వచ్చే సమయం లబ్ధిదారులకు ముందుగానే తెలియచేస్తున్నామన్నారు. డోర్ డెలివరీ ద్వారా నెలవారీ సరుకుల పంపిణీ 87 శాతం నుంచి 90శాతం వరకు జరుగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకులు ప్రతినెలా లబ్ధిదారులకు అందే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

- కట్టుబడివారిపాలెంలో విషాదం
- కుమార్తె అన్నప్రాసనకు వచ్చి ఒకరు...
- పెళ్లి భజంత్రీలు మోగకుండానే మరొకరు..



రమేష్‌బాబు(ఫైల్)



బాలకృష్ణ(ఫైల్)

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు దుర్మరణం పాలైన ఘటన పల్నాడు జిల్లా తిమ్మాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. జిల్లాలోని చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామానికి మోపూరు చిన్న కృష్ణారావు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. తొలి సంతానమైన కుమార్తె కోటేశ్వరి కాగా, ఆ తదుపరి వరుసగా రమేష్‌బాబు(31), బాలకృష్ణ (28) ఉన్నారు. రమేష్‌బాబు విశాఖపట్నంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి రెండేళ్ల కిందట భూలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఆరునెలల పాప మనస్విని ఉంది. పాప మనస్వినికి ఈనెల 11న అన్నప్రాసన కార్యక్రమం ఉండటంతో స్వగ్రామైన కట్టుబడివారిపాలెం గ్రామానికి వచ్చాడు. సోదరుడు బాలకృష్ణ నాదెండ్ల మండలం సాతులూరు గ్రామ పరిధిలో రైల్వే గేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురు అన్నదమ్ములు సోమవారం విధులకు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అన్న రమేష్‌బాబు విశాఖపట్నం వెళ్లేందుకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో దింపేందుకు ద్విచక్రవాహనంపై ఇరువురు బయలుదేరారు. ఈ క్రమంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు వెళుతున్న లారీ వెనుకగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఇరువురిపై లారీ చక్రాలు ఎక్కడంతో అన్నదమ్ములు ఇరువురు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. బాలకృష్ణకు సైతం అక్కకూతురుతో నిశ్చితార్థం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఇరువురు మృత్యువాత పడటంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. కళ్లముందే ఇద్దరు కన్న కొడుకులను కోల్పోయి ఆసుపత్రి ప్రాంగణంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తండ్రి చిన్న కృష్ణారావు తీరు చూపరులను కంటతడిపెట్టించింది.

సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ వావ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వావ

పాత గుంటూరు: సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావ తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమంపై నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, సఫాయి కర్మచారి సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సఫాయి కార్మికులతో ప్రమాదకరంగా ఓపెన్ డ్రైనేజీల్లో పనులు చేయించరాదని తెలిపారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ప్రాణాలు కాపాడటం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, ప్రీమియం కూడా నగరపాలక సంస్థ చెల్లించడం అభినందనీయమన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.17 లక్షల వరకు పరిహారం అందుతుందని ఆయన తెలిపారు. మరో 15 రోజుల్లో ప్రతి కార్మికుడికీ పీఎఫ్, ఈఎస్ఐ నంబర్‌తో ఐడీ కార్డులు కూడా అందించాలని నగరపాలక సంస్థ అధికారుల్ని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ పెద్ది రోజా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి గురువారం గ్రీవెన్స్ జరుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సోమి శంకరరావు, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.మధుబాబు, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ముత్యాలరావు, పారిశుద్ధ్య పనివారల సంఘం అధ్యక్షుడు మరియన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.మాల్యాద్రి పాల్గొన్నారు.

దేశ విభజనపై ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలపై గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్య పోరాటం గురించి వివరిస్తూ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చే ముందు రోజు 14న దేశ విభజన సందర్భంగా చోటు చేసుకున్న అవాంఛనీయ ఘటనలపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల జీవిత చరిత్రల గురించి తెలుసుకునేందుకు ప్రదర్శన దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అదనపు ఏడీఆర్ఎంలు సైమన్, సీనియర్ డీన్ కో- ఆర్డినేషన్ అనూష, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.